క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు



బాపట్ల అర్బన్: పట్టణంలోని పాత బస్టాండ్ సెంటరులో ఉన్న శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ మాస సప్త వార పూజా కార్యక్రమాల్లో భాగంగా మొదటి శుక్రవారం స్వామివారికి పంచామృత అభిషేకాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. అర్చకులు సత్యంబాబు, భార్గవ స్వామి, కమిటీ సభ్యులు సోమయ్య, శ్రీనివాసరావు, మోహన శ్రీనివాస్ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

2న శాంతి ప్రదర్శన



బాపట్ల: మణిపూర్‌లో జరిగిన హింసా కాండకు నిరసనగా ఆగస్టు 2న శాంతి ప్రదర్శన చేపడుతున్నామని క్రైస్తవ మత పెద్దలు శుక్రవారం తెలిపారు. బాపట్ల టౌన్ ఆల్ డినోమినేషన్స్ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన నిర్వహిస్తామని వారు చెప్పారు. ఈ మేరకు స్థానిక సీబీ జెడ్ చర్చిలో క్రైస్తవ సంఘాల నాయకులు పాల్గొని, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జి.మణిభూషణ్, జె.క్రిస్టఫర్, జి.జాన్ వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

కొల్లూరు: పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించి, జూదరులను అదుపులోకి తీసుకున్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గాజుల్లంక–పోతార్లంక మధ్య ఇటుక బట్టీల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్‌ఐ జి.రాజ్యలక్ష్మి సిబ్బందితో కలసి ఆకస్మిక దాడులు జరిపారు. ఈ దాడిలో ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకొన్నారు. వారి నుంచి రూ.8,040లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, తెనాలి కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఎస్‌ఐ రాజ్యలక్ష్మి తెలిపారు.

ఆలయ హుండీల రాబడి రూ.16.87 లక్షలు



చేబ్రోలు: పొన్నూరు పట్టణంలో ఖ్యాతిగాంచిన సహస్ర లింగేశ్వరస్వామి దేవస్థానం హుండీల రాబడిని శుక్రవారం దేవదాయశాఖ అధికారులు సమక్షంలో లెక్కించారు. దేవస్థానం ప్రాంగణంలోని ఆరు ఆలయాలకు చెందిన 20 హుండీల నుంచి రూ.16,87లక్షల రాబడి వచ్చినట్లు అధికారులు రమణమ్మ, తుల్లిమిలి శ్రీనివాస్ తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



నగరంపాలెం: జిల్లాలోని ప్రత్తిపాడులో మూడు ఎరువు, పురుగు మందుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు శుక్రవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. గుంటూరు రీజినల్ విజిలెన్స్ ఎస్పీ కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో ఈ తనిఖీలు కొనసాగాయి. ఇద్దరు డీలర్లు సక్రమంగా రికార్డులు నిర్వహించకుండా వ్యాపారాలు చేస్తున్నట్లు గుర్తించారు. ఆయా దుకాణాల నుంచి రూ.1.63 లక్షల ఖరీదు చేసే 14.150 మెట్రిక్ టన్నుల ఎరువులు స్వాధీనం చేసుకుని, రెండు '6ఏ' కేసులు నమోదు చేశారు. ఇక మూడు దుకాణాల్లో ప్రిన్సిపల్ ధ్రువీకరణ పత్రాల్లేకుండా విక్రయాలు చేస్తున్న రూ.1.63 లక్షల విలువైన పురుగు మందుల అమ్మకాలు నిలిపివేశారు. తనిఖీల్లో వ్యవసాయ అధికారిణి జె.వాసంతి, తహసీల్దారు కె.నాగమల్లేశ్వరరావు, స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

తెనాలిరూరల్: పట్టణంలో ట్రాఫిక్ ఎస్‌ఐ జోగి శ్రీనివాస్ శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. తెనాలి – నంది వెలుగు మార్గంలో ఆటోలను తనిఖీ చేశారు. ఆటోల్లో టేప్ రికార్డులు, స్పీకర్ బాక్సులను గుర్తించి వాటిని తొలగించారు. పెద్ద సౌండ్‌తో టేప్ రికార్డులు పెడుతూ ప్రయాణీకులకు ఇబ్బంది కలిగిస్తే ఊరుకునేది లేదని జోగి శ్రీనివాస్ హెచ్చరించారు. గతంలోనే ఈ విషయంపై హెచ్చరికలు చేయడం జరిగిందని కానీ డ్రైవర్లు నిబంధనలు పాటించడం లేదన్నారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులపై స్పందించి డీఎస్పీ జనార్దనరావు ఆదేశాలతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరిగిందన్నారు. 15 ఆటోలను గుర్తించి స్పీకర్లు తొలగించినట్లు చెప్పారు.

బాపట్లకు హరితహారం

- వేడుకలా గ్రీన్ బాపట్ల కార్యక్రమం
- జగనన్న పచ్చతోరణంలో భాగంగా మొక్కలు నాటిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచన

రేపల్లె రూరల్: మొక్కల పెంపకంతోనే వాతావరణ సమతుల్యత సాధించవచ్చని తహసీల్దారు డి.మల్లికార్జునరావు అన్నారు. గ్రీన్ బాపట్ల కార్యక్రమంలో భాగంగా తహసీల్దారు కార్యాలయం, పేటేరు సచివాలయ ఆవరణల్లో శుక్రవారం నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఫ్యాక్టరీలు, ఇతర కర్మాగారాల నుంచి వచ్చే ఉద్గారాలు, వాహనాల నుంచి వెలువడే పొగ, చెట్లను నరికివేయటంతో వాతావరణ కాలుష్యం ఏర్పడుతోందని, ఓజోన్ పొర దెబ్బతింటోందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడంతో పాటు వాటి పరిరక్షణ బాధ్యత తీసుకున్నప్పుడే వాతావరణ సమతుల్యత సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ పుట్టిన రోజున ఒక మొక్కను నాటి, పెంచాలని ఆకాంక్షించారు. అనంతరం మొక్కలు నాటారు. పర్యావరణాన్ని రక్షించుకుంటే కలిగే ప్రయోజనాలను కరపత్రాల రూపంలో పేటేరులో పంపిణీ చేశారు. సర్పంచ్ కనపర్తి వసుమతి, ఎంపీటీసీ రావు నెహ్రూలక్ష్మి, మేడికొండ సుధాకర చంద్రహాసరావు, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జ్ కనపర్తి రవికిరణ్, ఈఓపీఆర్డీ మల్లికార్జునరావు, గ్రామ సెక్రటరీ పుష్పకుమారి పాల్గొన్నారు. అదేవిధంగా చోడాయపాలెం సచివాలయ పరిధిలో వెల్ఫేర్ సెక్రటరీ శ్రీనివాసరావు, ఫీల్డ్ అసిస్టెంట్ గడ్డం వెంకటేష్ మొక్కలు నాటారు.

పర్యావరణ పరిరక్షణకు వృక్షాలు దోహదం

నగరం: పర్యావరణ పరిరక్షణకు పచ్చని చెట్లు దోహదపడతాయని తహసీల్దారు ఎం.శ్రీనివాసరావు అన్నారు. గ్రీన్ బాపట్ల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నగరంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పర్యావరణ కాలుష్యం వల్ల అకాల వర్షాలు, ఎండ తీవ్రత పెరుగుతోందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని కోరారు. అనంతరం ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలు, రహదారుల వెంట మొక్కలు నాటారు. తొలుత ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్, ఎంఈఓ కొలసాని హరిబాబు, అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలి

కర్లపాలెం: పర్యావరణ పరిరక్షణకు అందరూ మొక్కలు పెంచాలని ఎంపీపీ యారం వనజ, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి అన్నారు.



కలెక్టరేట్‌లో ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేసిన కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ శ్రీధర్



రేపల్లె తహసీల్దారు కార్యాలయ ఆవరణలో మొక్క నాటుతున్న తహసీల్దారు మల్లికార్జునరావు



ర్యాలీలో పాల్గొన్న నగరం తహసీల్దారు, ఎంపీడీఓ



పెసర్లంకలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

హరిత బాపట్ల కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, ఎంవీరాజుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏఎంసీ చైర్మన్ సీతారామిరెడ్డి, డీపీవో దాసరి రాంబాబుతో కలిసి మొక్కలు నాటారు. డీపీవో రాంబాబు మాట్లాడుతూ కర్లపాలెం మండల పరిధిలో 9వేల మొక్కలు నాటినట్లు తెలిపారు. ఆగస్టు 9న జరిగే ఆజాదీ కా అమృత్ దినోత్సవంలో భాగంగా అన్ని గ్రామాల్లో మొక్కలు నాటిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు కేశవ నారాయణరావు, ఈవోపీఆర్డీ ఎలీషాబాబు, డీటీ సలీమా, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ అమీర్‌బేగ్, ఏపీవో శ్రీనివాసులురెడ్డి, ఎంఈవో ఎన్.విజయశ్రీ పాల్గొన్నారు.

చుండూరులో..

యడ్లపల్లి(వేమూరు): చుండూరు మండలంలోని యడ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో శుక్రవారం జెడ్పీటీసీ దాట్ల సౌజన్య గ్రీన్ బాపట్ల కార్యక్రమంలో భాగంగా.. మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. వలివేరు గ్రామ సర్పంచ్ పందిపాటి ఏసు, ఎంపీటీసీలు అమర్తలూరు ప్రవీణ్, పఠాన్ అబ్దుల్లా, ఎంపీడీఓ సుగుణమ్మ, తహసీల్దారు కనకదుర్గా, మండల విస్తరణాధికారి విజయలక్ష్మి, హెచ్‌ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వృక్షాలతో పర్యావరణం పదిలం

చందోలు(కర్లపాలెం): పచ్చని చెట్లతో పర్యావరణం పదిలంగా ఉంటుందని పిట్టలవానిపాలెం ఎంపీపీ ఎస్కే బాజీ అన్నారు. గ్రీన్ బాపట్ల కార్యక్రమంలో భాగంగా పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలో సర్పంచ్ గౌరీదేవి విజయకుమారి ఆధ్వర్యంలో ఎంపీపీ, ఎంపీడీవో మారుతీ శేషమాంబ మొక్కలు నాటి, నీళ్లు పోశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు రహదారుల కార్పొరేషన్ డైరెక్టర్ అహ్మద్ హుస్సేన్, తహసీల్దారు డి.కవిత, ఈవోపీఆర్డీ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రీన్ బాపట్ల

భట్టిప్రోలు: గ్రీన్ బాపట్ల కార్యక్రమంలో భాగంగా.. భట్టిప్రోలు మండలస్థాయిలో మొక్కల నాటే కార్యక్రమాన్ని శుక్రవారం పెసర్లంక దేవభక్తుని కోటయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల, రైతు భరోసా కేంద్రాల వద్ద నిర్వహించారు. ఎంపీటీసీ నన్నెపాముల చంటి, చింతమోటు, పెసర్లంక సర్పంచులు గుమ్మడి శంకరావు, వేములపల్లి వెంకటేశ్వరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ గుమ్మడి సాంబశివరావు, ఎంఈవో–2 దేవరాజు, ఈవోపీఆర్డీ టి.ఉషారాణి, పంచాయతీ కార్యదర్శి బి. పుష్పలత, దీపక్, గణేష్, మండల సమాఖ్య ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, ప్రధానోపాధ్యాయులు ఎస్కే మహబూబ్ బాషా, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో సుధీర్, వెల్లటూరు యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

మొక్కల పరిరక్షణ బాధ్యత తీసుకోవాలి

వేమూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని ఎంపీపీ యల్లమాటి మోహన్ తెలిపారు. వేమూరు మండల కేంద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం గ్రీన్ బాపట్ల కార్యక్రమం చేపట్టారు. ఎంపీపీ, జెడ్పీటీసీ మొక్కలు నాటారు. జెడ్పీటీసీ గాజుల హేమలత, భాను ప్రకాశ్, కో–ఆప్షన్ మెంబరు తలతోటి సువర్ణరావు, ఉప సర్పంచ్ తలతోటి ప్రదీప్, దొప్పలపూడి జ్యోతిబాబు, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంఈఓ శ్రీనివాసరరావు, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు. అమర్తలూరు ఎంపీపీ రాపర్ల నరేంద్ర, గ్రామ సర్పంచ్ రాము, తహసీల్దారు మోహర్, విద్యాశాఖ అధికారి కనపాల రమేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రీన్ బాపట్ల సూపర్

బాపట్ల: 'కడుపు నింపే కూడు నేనే...నీడ నిచ్చే గూడు నేనే..నువ్వు కట్టే బట్ట నేనే..ఆయువు నేనే ...ప్రాణ వాయువు నేనే...కాడి నేనే పాడె నేనే...నిన్ను కాల్చే కట్టె నేనే...నేను తరువుని...నీ బతుకు తెరువుని కన్ను విప్పి కాంచరా..ఒక్క మొక్కైనా పెంచారా' అంటూ... కలెక్టరేట్‌లో గ్రీన్ బాపట్ల సందర్భంగా ఏర్పాటు చేసిన బోర్డును జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ శ్రీధర్ ఆవిష్కరించారు. జిల్లా అధికారులు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యులయ్యారు.



ఎంవీరాజుపాలెం ఉన్నత పాఠశాలలో మొక్క నాటుతున్న ఏఎంసీ చైర్మన్, డీపీఓ



యడ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్క నాటుతున్న జెడ్పీటీసీ సౌజన్య



చందోలులో మొక్క నాటిన ఎంపీపీ ఎస్కే బాజీ, ఎంపీడీఓ శేషమాంబ.



వేమూరు పాఠశాలలో మొక్క నాటిన ఎంపీపీ మోహన్

దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



రేపల్లె: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కృష్ణానదిలో వరద నీరు అధికంగా చేరటంతో రేపల్లె దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు డి.మల్లికార్జునరావు హెచ్చరించారు. వరద సమాచారాన్ని నదీ పరివాహక ప్రాంతాల ప్రజలకు తెలియజేయాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ప్రకాశం బ్యారెజ్ నుంచి దిగువకు 2.63 లక్షల క్యూసెక్కుల వరద నీరు విడుదల చేసినట్లు తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని నదిలోకి చేపల వేటకు వెళ్లరాదని మత్స్యకారులకు సూచించారు. పడవల ద్వారా పశువుల చేరవేత ప్రమాదకరమన్నారు. వరద ఉధ్రుతి మరింత పెరిగే అవకాశం ఉన్నందున ఆయా గ్రామాల్లోని రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉండి, ప్రభుత్వం అందించే సమాచారాన్ని ప్రజలకు, వరద ఉధ్రుతిని అధికారులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని స్పష్టం చేశారు.

హద్దు సమస్యల పరిష్కారానికి రీసర్వే దోహదం



కొల్లూరు : భూముల హద్దు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన రీసర్వే దోహదపడుతుందని కొల్లూరు తహసీల్దారు ఎ.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం దోనేపూడిలో రీసర్వే ప్రక్రియపై ఆయన గ్రామసభ నిర్వహించారు. అనంతరం సర్వే ప్రారంభించారు. గ్రామంలో 2,109 ఎకరాల భూమికి రీసర్వేలో భాగంగా కొలతలు నిర్వహించి, హద్దులు నిర్ణయించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ సర్వేకి సహకరించాలని కోరారు. ఆరు సర్వే బృందాల ద్వారా నెల రోజుల వ్యవధిలో ఈ ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీటీ త్రివేణి, మండల సర్వేయర్ ఖాదర్ పాల్గొన్నారు.

31న మండల సర్వసభ్య సమావేశం

బాపట్ల అర్బన్: మండల సర్వసభ్య సాధారణ సమావేశం ఈ నెల 31న మధ్యాహ్నం 2 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ ఎ.రాధాకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులందరూ సమావేశానికి హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- నాలుగేళ్లలో ఇచ్చిన ప్రతి హామీని సీఎం జగనన్న నెరవేర్చారు
- వచ్చే ఎన్నికల్లో దొంగలంతా ఏకమై వస్తారు.. జాగ్రత్తా..
- బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారుల వద్దకే అందిస్తున్న ఘనత వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వానిదేనని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. శుక్రవారం మండలంలోని అడివి 2, ముత్తాపాలెం సచివాలయ పరిధిలో జరిగిన జగనన్న సురక్ష శిబిరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. జగనన్నలాంటి గొప్ప వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం ప్రజల అదృష్టమన్నారు. ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు అందించాలనే లక్ష్యంతో ఆయన సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని తెలిపారు. ఇప్పటికే మారుమూల గ్రామాల్లో సైతం రోడ్లను వేశామని ఎమ్మెల్యే వెల్లడించారు. అభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి మంత్రులు, ఎమ్మెల్యేలు గడప గడపకు వెళ్తున్నట్లు చెప్పారు. జగనన్న సంక్షేమ పథకాలు అందాయా? సమస్యలు ఉంటే అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారించేలా చూస్తున్నామన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అడవి 2 సచివాలయం పరిధిలో 2,059, ముత్తాయపాలెం సచివాలయం పరిధిలో 1,902 మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కోకి రాఘవరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ వడ్డీముక్కల డేవిడ్, మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు చిన్నపోతుల హరిబాబు, మత్స్యశాఖ డైరెక్టర్ కోకిలగడ్డ చెంచయ్య, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిన్నిబోయిన ప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కృష్ణమూర్తి, ఎంపీడీఓ ఎ.రాధాకృష్ణ ఈవోపీఆర్డీ పులి శరత్‌బాబు, తహసీల్దారు సీహెచ్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

ప్రతి హామీ నెరవేరుస్తున్నాం

2014 ఎన్నికల్లో బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన నారా చంద్రబాబునాయుడు అనంతరం వాటిని గాలికి వదిలేసి, ప్రజలను నిలువునా ముంచారని ఎమ్మెల్యే కోన రఘుపతి విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో దొంగలంతా ఏకమై వస్తారని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. నిత్యం ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి కుటుంబాన్ని ఆయన తన సొంత కుటుంబంలా భావించి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు.

జీవనోపాధి మెరుగు పరుచుకోవాలి

బాపట్ల అర్బన్: ఫిష్ ఆంధ్ర షాపుల ద్వారా ప్రతి లబ్ధిదారుడు వారి జీవనోపాధిని మెరుగుపరచుకోవాలని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. శుక్రవారం సూర్యలంక తీరాన పది ఫిష్ ఆంధ్ర దుకాణాలను ఆయన ప్రారంభించారు. జిల్లా మత్స్యశాఖ అధికారి డాక్టర్ పి.సురేష్, ఏడీ సైదా, ఎఫ్‌డీడీ రవీంద్ర, జెడ్పీటీసీ ఎస్తేరు రాణి, ఎంపీడీవో ఎ.రాధాకృష్ణ, తహసీల్దారు సీహెచ్ సుధారాణి, ఎంపీపీ చిన్న పోతులహరిబాబు, మత్స్యకారా కార్పొరేషన్ డైరెక్టర్లు కొక్కిలిగడ్డ చెంచయ్య, కన్నా మవిడయ్య పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కర్లపాలెం: ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని విద్యుత్ ఏఈ హరిప్రసాద్ కోరారు. శుక్రవారం కర్లపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద విద్యుత్ ఉద్యోగులు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన ప్రదర్శన చేశారు. ఏడీ హరిప్రసాద్ మాట్లాడుతూ పీఆర్సీ తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ మల్లెల కుమార్ , జేఈ దుర్గా ప్రసాద్, విజయేంద్ర, సిబ్బంది, చిన్నబ్బాయి సంతోష్, హరికృష్ణ, దీనరాజ్ ఉన్నారు.

కొనసాగుతున్న కృష్ణమ్మ వరద ఉధృతి

కొల్లిపర: గత కొన్ని రోజుల నుంచి కృష్ణా ఎగువ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు సాగర్ డ్యామ్ నుంచి గురువారం సాయంత్రం కూడా సుమారు 1.50 లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీరు దిగువకు వదిలిన కారణంగా రెండోవ రోజు శుక్రవారం కూడా కృష్ణా నదిలో వరద ఉధృతి కొనసాగుతుంది. దీంతో మండల పరిధిలోని లంక గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు జి.నాంచారయ్య, ఎంపీడీఓ వి.చంద్రమోహన్ అన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, తహసీల్దారు ప్రజలతో, రైతులతో మాట్లాడుతూ నదిలోకి వరద నీరు గురువారం కన్న ఎక్కువ చేరడం వల్ల లంక గ్రామాలకు, కూలీ పనులకు వెళ్లే వారు వరద ఉధృతి తగ్గే వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పడవ వేయు వారు రాత్రి సమయంలో తప్పని పరిస్థితిలోనే మాత్రం పడవ వేయాలని, పడవ వేసే సమయంలో గ్రామ వీఆర్‌ఓకి సమాచారం ఇవ్వాలని హెచ్చరించారు. నదిలో వరద ఉధృత్తి పూర్తిగా తగ్గే వరకూ పిల్లలు, వృద్ధులు ఇటు వైపు రాకుండా ఉండేలా వీఆర్‌ఓలు, వీఆర్‌ఎలు తగు చర్యలు తీసుకోవాలి అన్నారు. లంక గ్రామాల్లో, ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు వెంటనే ఏర్పాటు చేయాలి సిబ్బందికి ఆదేశించారు.

పెరటి కూరగాయలతో ఆరోగ్యం

నిజాంపట్నం: పురుగు మందు అవశేషాల కూరగాయలను తినడం వల్ల అనారోగ్యం పాలవుతామని ఎంపీటీసీ సభ్యులు మోపిదేవి హరనాథబాబు అన్నారు. మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం డ్వాక్రా మహిళలకు కూరగాయల విత్తనాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ పురుగు మందులు ఉపయోగించకుండా ఇంటి పెరటిలో కూరగాయల మొక్కలు పెంచుకుంటే మంచిదన్నారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, తహసీల్దారు నెహ్రూబాబు, ఈవోపీఆర్డీ సునీత, సర్పంచ్ కట్టా పోలేరమ్మ, ఉప సర్పంచ్ మార్కండేయులు, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ నాయుడు వెంకటేశ్వరరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు శ్రీలక్ష్మి, ఏపీఎం కృపాసాగర్ పాల్గొన్నారు.

యానిమేటర్లకు విత్తన ప్యాకెట్ల పంపిణీ

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండల సమాఖ్య కార్యాలయంలో మండల పరిధిలోని యానిమేటర్లకు శుక్రవారం పెరటి విత్తనాల ప్యాకెట్లను వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి అందజేశారు. ఈ సందర్భంగా ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఒక్కో ప్యాకెట్ రూ.65 చొప్పున అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో 8 రకాలైన పాలకూర, గోంగూర, బెండ, తోటకూర, గోరు చిక్కుడు, బీర, వంగ, టమాట విత్తనాల ప్యాకెట్లు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ టి.ఊషారాణి, సీసీలు రజనికుమారి, హనోక్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కర్రా స్వరాజ్యలక్ష్మి, అకౌంటెంట్ శిరీష తదితరులు పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేసిన ఎంపీటీసీ సభ్యుడు మోపిదేవి హరనాథబాబు

నేతన్నలకు అండగా సీఎం వైఎస్ జగన్

భట్టిప్రోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేనేతలకు అండగా ఉండి, సంక్షేమ పథకాలు అందించడం జరిగిందని జెడ్పీటీసీ సభ్యురాలు టి.ఉదయ భాస్కరి, వైస్ ఎంపీపీ కె.పిచ్చయ్యశాస్త్రి తెలిపారు. శుక్రవారం భట్టిప్రోలు విలేకర్లతో వారు మాట్లాడారు. మండల పరిధిలో రూ.24 వేలు వంతున 732 మందికి రూ.1.75 కోట్లు నేతన్న నేస్తం ద్వారా అందినట్లు తెలిపారు. గతంలో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు చేనేత సొసైటీలను పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆరోపించారు. 2004లో అధికారంలోకి వచ్చిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అప్పట్లో చేనేతల బ్యాంక్ రుణాలు రూ.200 కోట్లు రద్దు చేసి ఆదుకున్నారని గుర్తుచేశారు. సీఎం జగన్ తండ్రికి తగ్గ తనయుడిగా కులం, మతం, వర్గం, ప్రాంత భేదాలు లేకుండా అన్ని వర్గాల వారిని ఆదుకుంటున్నారని కొనియాడారు. సమావేశంలో మాజీ ఎంపీపీ మాచర్ల హేమసుందరావు, ఎంపీటీసీ సభ్యురాలు కె.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ

ఆటో ఢీ కొని ఇద్దరికి తీవ్రగాయాలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం వెల్లటూరు - కొల్లూరు రహదారిలో ఉత్తర సంఘం వద్ద ఆటో ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. సేకరించిన వివరాల మేరకు.. శుక్రవారం కొల్లూరు నుంచి బియ్యం లోడ్‌తో వస్తున్న ఆటో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ అబ్రహం అక్కడి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించగా.. స్థానికులు అతడిని పట్టుకున్నారు. ఈ ప్రమాదంలో గుంటూరుకు చెందిన యోహాన్ కుడి కాలుకు, టి.సాంబయ్యకు తల, చేతులు, ముఖానికి తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం మేరకు 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నీట మునిగిన వరి పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

తెనాలిటౌన్: భారీ వర్షాలకు నీట మునిగిన కొలకలూరు గ్రామ పరిధిలో వరి పొలాలను డాట్ సెంటర్ కో–ఆర్డినేటర్ డాక్టర్ జి.కిషోర్‌బాబు, ప్రిన్సిపల్ సెంటిస్ట్ డాక్టర్ శ్రీలతావాణిలు శుక్రవారం పరిశీలించారు. ఆర్బీకెలో రైతులతో మాట్లాడారు. పంట పరిరక్షణకు రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్బీకె వ్యవసాయ సహాయకులు నాగరాజు, రైతులు పాల్గొన్నారు.